క్లుప్తంగా

మద్యం తాగి వాహనాలు నడపొద్దు



గోవిందరావుపేట: మద్యం తాగి వాహనాలు నడపొద్దని పస్రా ఎస్సై అచ్చ కమలాకర్ అన్నారు. మండల పరిధిలోని పస్రా పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం ఎస్సై డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బహిరంగా ప్రదేశాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనాల్లో పరిమితికి మించి ప్రజలను తీసుకువెళ్లొద్దని అన్నారు. నిబంధనలు ఎవరూ అతిక్రమించిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కుట్టు మిషన్లు పంపిణీ చేయాలి

భూపాలపల్లి రూరల్: మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేయాలని ఎమ్మార్పీఎస్(టీఎస్) జిల్లా అధ్యక్షుడు ఎలకటి రాజయ్య ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ప్రభుత్వం మహిళలకు ప్రతి మండలానికి సెర్ప్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్లు అందించిందని.. అసెంబ్లీ ఎన్నికల కోడ్ మూలంగా కొన్ని మండలాలకు పంపిణీ నిలిచిపోయిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడి సుమారు 15 నెలలు అవుతున్నా పంపిణీ చేయడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి మహిళలకు కుట్టు మిషన్లు అందించాలని పేర్కొన్నారు.

బియ్యం అందజేత



టేకుమట్ల: మండలంలోని సోమనపెల్లి గ్రామానికి చెందిన మారెపెల్లి రాజకొమురయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను అంకుషాపూర్ యూత్ కమిటీ సభ్యులు పరామర్శించి క్వింటా బియ్యాన్ని అందించారు. రాజ్‌కుమార్, అశ్వద్ధామ, అరుణ్‌కుమార్, హరీష్, మధూకర్, కార్తీక్, రాజు, రాణాప్రతాప్, తదితరులు ఉన్నారు.

డ్రెయినేజీ నిర్మాణ పనులు

వాజేడు : మండలంలోని జగన్నాథపురం గ్రామం నుంచి చెరుకూరు వరకు జరుగు తున్న రహదారి పనుల్లో భాగంగా డ్రెయినేజీల నిర్మాణం చేపట్టారు. గ్రామాలు ఉన్న చోట డ్రెయినేజీ, ఫుట్‌పాత్ పనులు జరుగుతున్నాయి. ఈ పనులను శరవేగంగా నిర్మిస్తున్నారు. ప్రస్తుతం జగన్నాథపురం గ్రామం వద్ద ఈ డ్రెయినేజీ పనులు కొన సాగుతున్నాయి.

‘తీన్మార్ మల్లన్న సస్పెండ్ దుర్మార్గమైన చర్య’

భూపాలపల్లి రూరల్: ప్రజాస్వామ్యబద్ధంగా బీసీల కోసం పోరాడుతున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను కాంగ్రెస్ పార్టీ సస్పెండ్ చేయడం రెడ్ల అహంకారానికి ప్రతీకగా బీసీ సమాజం భావిస్తుందని జిల్లా బీసీ ఇంటలెక్చువల్ ఫోరం కోఆర్డినేటర్ సంపత్‌పటేల్ ఆదివారం ఒక ప్రకటనలో దుయ్యబట్టారు. జనాభాలో 60 శాతం ఉన్నటువంటి బీసీలను 42 శాతంగా సూచించిన కారణంగా బీసీ పక్షాన ప్రశ్నించారన్నారు. అగ్రకులాలు ఆధిపత్య వర్గాలు కూడా ప్రభుత్వం మీద విరుచుకుపడ్డాయని, వారిని సస్పెండ్ చేసిన సందర్భాలు లేవన్నారు. మల్లన్న సస్పెండ్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

రైతు వేదికల నిర్వహణ ఎలా?

- నిలిచిన నిధులు
- ఏఈఓలపైనే భారం

వెంకటాపురం(కె): పంటల సాగులో రైతులకు విస్తృతంగా సేవలు అందించాలనే లక్ష్యంతో నిర్మించిన రైతు వేదికల నిర్వహణ వ్యవసాయ అధికారులకు భారంగా మారింది. ప్రతీ వారం రైతు నేస్తం కార్యక్రమాల నిర్వహణతోపాటు పంటల సాగులో మెలుకువల కోసం ఏర్పాటు చేసే అవగాహన సదస్సులు, ఇతర ప్రభుత్వ పథకాలను ప్రజలకు, రైతులకు చేరవేసేందుకు నిర్వహించే భారమంత వ్యవసాయ శాఖ అధికారుల పైనే పడుతోంది. ప్రభుత్వం రైతు వేదికల నిర్వహణ కోసం విడుదల చేసే నిధులను విడుదల చేయక పోవడంతో ఏఈఓలే డబ్బులు ఖర్చు పెట్టి క్యాక్రమాలు నిర్వహించాల్సి వస్తోంది. నిధులు విడుదల కాకపోవంటతో విద్యుత్ బిల్లులు రూ.వేలల్లో పేరుకుపోతున్నాయి. ఫలితంగా రైతులకోసం నిర్వహించే కార్యక్రమాలను సైతం పూర్తి స్థాయిలో చేపట్టలేకపోతున్నారు. మండలంలో 19 పంచాయతీ ఉండగా వాటిలో మూడు రైతు వేదికలను గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మండల పరిధిలోని ఆలుబాక, మరికాల, పాత్రాపురం పంచాయతీల్లో రైతు వేదికలను నిర్మించింది. కాగా గత ప్రభుత్వం రైతు వేదికల నిర్వహణ కోసం నెలకు రూ.9 వేలు విడుదల చేసింది. కొంత కాలంగా నిధులు రావడం ఆగిపోవడంతో రైతు వేదికల నిర్వహణ భారంగా మారింది. స్వీపర్, కరెంట్ బిల్లు తాగునీటి ఖర్చు తదితర ఖర్చులను ఏఈఓలే చెల్లిస్తున్నారు.



పాత్రాపురం రైతు వేదిక

వివరాలు సేకరించారు..



రైతు వేదికల నిర్వహణ కోసం ప్రభుత్వం నుంచి నిధులు రావటం లేదు. రైతు వేదికల్లో నిర్వహించే కార్యక్రమాల నిర్వహణ భారంతో పాటు విద్యుత్, తాగునీటి బిల్లులు, స్వీపర్ ఖర్చులకు సొంతగా చెల్లించాల్సి వస్తోంది. కాగా, ప్రభుత్వం ఇటీవల కాలంలోనే రైతు వేదిక నిర్వహణపై వివరాలు సేకరించింది. నిధులు మంజూరు అయ్యే అవకాశం ఉంది.

- నవీన్, ఏఓ వెంకటాపురం(కె)

కరాటే శిక్షణతో ఆత్మరక్షణ.. ఆరోగ్యం

- ధనసరి సూర్య

ఎస్ఎస్ తాడ్వాయి : ఆత్మరక్షణకు కరాటే శిక్షణ దోహదపడుతుందని కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి ధనసరి సూర్య అన్నారు. ఆదివారం మేడారంలోని టీటీడీ కల్యాణ మండపంలో సూర్య షోటోకాన్ కరాటే అకాడమీ అధ్వర్యంలో 7వ రాష్ట్రస్థాయి కరాటే టోర్నమెంట్‌ను ఆయన అయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సూర్య మాట్లాడుతూ.. యువత కరాటే నేర్చుకోవడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని, స్వీయ రక్షణకు కరాటే ఎంతో దోహదపడుతుందన్నారు. అనంతరం కరాటే పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పూజారులు సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, ఇన్‌చార్జ్ ఎంఈఓ రేగ కేశవరావు, రాష్ట్ర పోలీస్ కరాటే, యోగా కోచ్ పాయం సురేష్, ఎస్టీ సెల్ జిల్లా కార్యదర్శి వెంకన్న, సిద్దబోయిన రమేష్, భోజారావు, కుర్సం రవి, హన్మంతరావు, లక్ష్మణమూర్తి, నేతాజీ, మైపతి సంతోష్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ధనసరి సూర్య

సంప్రదాయాలను కాపాడుకోవాలి



మొక్కలు చెల్లిస్తున్న రవిచందర్, తదితరులు

ములుగు: సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకున్నప్పుడే జాతి మనుగడ సాధ్యమవుతుందని గ్రంథాలయ కమిటీ చైర్మన్ బానోత్ రవిచందర్ అన్నారు. సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకల్లో భాగంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని సేలావాల్ మహరాజ్ ఆలయంలో మేరామ్మ యాడికి మొక్కలు చెల్లించారు. ఈ సందర్భంగా రవిచందర్ మాట్లాడుతూ జాతి ఉన్నతికి గిరిజన లంబాడాలు ఏకతాటిపైకి రావాలన్నారు. మంత్రి సీతక్కను కోరిన విధంగా కమ్యూనిటీ హాల్ నిర్మాణం, ఆలయ నిర్మాణానికి కమిటీ సభ్యులు తీర్మానం చేయాలని అన్నారు. కలెక్టర్ దివాకర్‌ను కలిసి భూమి కేటాయింపుపై చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీలకు అతీతంగా అందు కలిసి మెలసి ఉండాలని సూచించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో కన్వీనర్‌లు పోరిక సర్వన్ కుమార్, పోరిక జయరామ్, కోశాధికారి బాలు నాయక్, కార్యవర్గ సభ్యులు రమేశ్, తిరుమల సింగ్, రాజునాయక్, కసన్ సింగ్, రఘురాం, హోహన్‌లాల్, తిరుపతి, అనంతరాం నాయక్, మోహన్, కుమార్ పాండ్య, రాహుల్‌నాయక్, సన్ కిసన్, సమ్మయ్య, సాంబయ్య పాల్గొన్నారు.

పంటలకు గిట్టుబాటు ధర చెల్లించాలి



ధర్నా చేస్తున్న నాయకులు

- బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజేందర్

రేగొండ: రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర చెల్లించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అంకం రాజేందర్ అన్నారు. ఈ మేరకు ఆదివారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఏడాది క్వింటా మిర్చికి రూ.20 వేలు పలికిన ధర ప్రస్తుతం రూ.13 వేలు కూడా పలకడం లేదన్నారు. వానాకాలం పండించిన వరి ధాన్యం అమ్మి రెండు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు బోనస్ రాలేదని అన్నారు. బోరు బావుల్లో నీరు అడుగంటుతుండటంతో ఎస్సారెస్పీ కాల్వల ద్వారా నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అప్పుల బాధతో మృతి చెందిన కొత్తపల్లిగోరి మండలంలోని వెంకటేశ్వర్లపల్లి గ్రామానికి చెందిన బండారి రవి కుటుంబాన్ని ప్రభుతం ఆదుకోవాలన్నారు. ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ సామల పాపిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కోలేపాక భిక్షపతి, హింగే మహేందర్, దగ్గు వెంకటేశ్వరరావు, గంపల లింగన్న, బండి రమేష్, దాట్ల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆదాయం రూ.1.35 లక్షలు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి వేడుకల సందర్భంగా భక్తులు హుండీ, అర్చనలు ఇతర పూజా కార్యక్రమాలలో భాగంగా అందజేసిన కానుకలు రూ.1.35లక్షలు వచ్చినట్లు ఆలయ చైర్మన్ మడుగూరి ప్రసాద్ తెలిపారు. ఆదివారం ఆలయంలో ధర్మకర్తలు, ఎండోమెంట్ ఆధ్వర్యంలో హుండీలోని కానుకలను లెక్కించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు రాజ్‌కుమార్, దుర్గం కొమురయ్య, వేణుగోపాల్‌లాహోటి, చిటమట రఘు, రాంలాల్, హనుమంత్ పాల్గొన్నారు.



కానుకలను లెక్కిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

జాతీయ మార్కెట్ విధానాన్ని వ్యతిరేకించండి

- తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు వెంకట్‌రెడ్డి

గోవిందరావుపేట: జాతీయ వ్యవసాయ మార్కెట్ విధానాన్ని రైతులు వ్యతిరేకించాలని తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వెంకట్‌రెడ్డి అన్నారు. మండలంలోని పస్రాలో రైతు సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించగా ముఖ్య అతిథిగా వెంకట్ రెడ్డి హాజరై మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన జాతీయ వ్యవసాయ మార్కెట్ విధాన ముసాయిదాను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన మూడు నల్ల చట్టాలు వ్యతిరేకిస్తూ రైతాంగం ఒక సంవత్సరం ఆందోళన చేయడంతో కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకొని ప్రధాని రైతులకు క్షమాపణ కూడా చెప్పారన్నారు. ఇప్పుడు కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ఉండే మార్కెట్ విధానాన్ని తెచ్చి పార్లమెంట్‌లో చట్టం తీసుకురావాలని చూస్తుందన్నారు. దీంతో గత ఏడాది నుంచి రైతులు ఆందోళన చేస్తున్నా మద్దతు ధర చట్టం చేయకుండా దొడ్డి దారిన జాతీయ మార్కెట్ చట్టం తెచ్చి దేశంలోని రైతులను మోసం చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సోమా మల్లారెడ్డి, అంబాల పోశాలు, గుండు లెనిన్, రామస్వామి, సూర్యనారాయణ, కృష్ణారావు, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్ రెడ్డి

విద్యారంగ సమస్యలపై పోరాటం

ములుగు రూరల్: ఎస్ఎఫ్ఐ ఆవిర్భావం నుంచి విద్యారంగ సమస్యలపై అలుపెరుగని పోరాటాలు చేస్తుందని ఎస్ఎఫ్ఐ మాజీ నాయకుడు జన్ను సదయ్య అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 23న భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా హనుమకొండ కాళోజీ కళాక్షేత్రంలో ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థి నాయకుల సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమ్మేళనానికి నాయకులు హాజరై విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సమ్మేళన నిర్వహణ కన్వీనర్ సాంబశివ, తుమ్మల వెంకట్ రెడ్డి, పాండురంగ, మల్లారెడ్డి, రొంటాల భిక్షపతి, రాజేందర్, ప్రవీణ్, తోకల రవి, కిరణ్, సద్దాం హుస్సేన్, రాంబాబు, గణేష్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సదయ్య

రైతులకు పరిహారం చెల్లించాలి

- బీఎస్పీ మండల అధ్యక్షుడు గణేశాచారి

వెంకటాపురం(కె): బాండ్ కంపెని మొక్కజొన్న సాగు చేసి నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని బహుజన సమాజ్‌వాది పార్టీ మండల అధ్యక్షుడు గణేశాచారి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని బర్లగూడెంలో బాండ్ కంపెని మొక్కజొన్న పంటను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులు పండించిన పంటకు సరైన దిగుబడి రాక పంటలు నష్టపోయారని వారికి న్యాయం జరిగే వరకు వారి తరపున బీఎస్పీ పోరాటం చేస్తుందని అన్నారు. అధికారులు స్పందించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బోల్లే సతీష్, వేల్పాల బాబురావు, రైతులు తదితరులు ఉన్నారు.



మొక్కజొన్న పంటలను పరిశీలిస్తున్న నాయకులు

వైభవంగా బొడ్రాయి ప్రతిష్ఠాపన

మంగపేట: మండలంలోని నర్సింహసాగర్ పంచాయతీ పరిధి శనిగకుంటలో బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున పరమేశ్వరి(బొడ్రాయి) యంత్ర ప్రతిష్ఠ అనంతరం ఆదిలక్ష్మీ, భూలక్ష్మీ, ముత్యాలమ్మతల్లి, పోతురాజు, ఆంజనేయస్వామి, గ్రామదేవతల ప్రతిష్ఠను బ్రహ్మశ్రీ పండితులు సంజీవ్‌కుమార్ సిద్ధాంతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఎట్టి రవీందర్, వెంకన్న, నాగరాజు, కృష్ణ, నరేందర్, ఈశ్వరమ్మ, సుక్కమ్మ, గణపతి, జయమ్మ, చందు, శ్రీరామ్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.



ప్రతిష్ఠాపన వేడుకల్లో గ్రామస్తులు

శ్రీపాదరావు సేవలు మరువలేనివి



టేకుమట్ల: శ్రీపాదరావు జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే సత్యనారాయణరావు



కాళేశ్వరంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

ఉమ్మడి రాష్ట్రంలో ప్రజలకు దివంగత మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు చేసిన సేవలు మరువలేనివని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి వేడుకలను ఆదివారం జిల్లా వ్యాప్తంగా అధికారులు, నాయకులు నిర్వహించారు. శ్రీపాదరావు విగ్రహానికి, చిత్రపటాలకు పూలమాలు వేసి నివాళులర్పించారు. టేకుమట్ల మండలంల రాఘవరెడ్డిపేటలో నిర్వహించిన జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. సర్పంచ్ నుంచి శాసనసభ స్పీకర్‌గా అంచెలంచెలుగా ఎదిగిన ఆయన ఎంతో మందికి ఆదర్శమన్నారు.

- సాక్షి నెట్‌వర్క్



కాటారం: అటవీశాఖ కార్యాలయంలో శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాల వేస్తున్న అధికారులు



కాటారం: చింతకాని క్రాస్ వద్ద..



మహదేవపూర్ పీఏసీఎస్‌లో..



కాళేశ్వరం: అన్నదానం చేస్తున్న నాయకులు

ఎండుతున్న పొలాలు



ఎండిన వరిచేనులో పశువులను మేపుతున్న రైతు



నీరు లేక నెర్రెలు బారిన పొలం

- అడుగంటిన భూగర్భ జలాలు
- కాల్వల ద్వారా నీరు విడుదల చేయాలని కోరుతున్న రైతులు

రేగొండ: ఆరుగాలం కష్టపడి పండించిన పంట ఆదిలోనే చేతికందకుండా పోతోంది. యాసంగిలో సాగు చేస్తున్న వరి పొలాలు నీళ్ల లేక ఎండిపోతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటుతుండటంతో బోరు బావుల్లో నీళ్ల లేవు. వేసవికి ముందే పంటలు ఎండిపోతుండటంతో మరో రెండు నెలల పాటు పంట పొలాన్ని ఎలా కాపాడుకోవాలో తెలియక రైతులు ఆదోళన వ్యక్తం చేస్తున్నారు. ఎండిన పంట పొలాలను పశువుల మేతకు వదిలి పెట్టి, పంట సాగుకు చేసిన అప్పులు ఎలా తీర్చాలని రైతన్నలు దీనంగా చూస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి డీబీఎం 38 కాల్వల ద్వారా నీళ్ల సరఫరా చేయాలని రైతు కోరుతున్నారు. కాల్వల ద్వారా నీటిని విడుదల చేస్తే పంటలను కాపాడుకోవచ్చని తెలిపారు. అలాగే చెరువులు నింపుకోవడంతో భూగర్భ జలలు కూడా పెరిగి బోర్లు, బావుల్లో నీరు ఉంటుందని రైతులు తెలుపుతున్నారు.

నీటిని విడుదల చేయాలి



డీబీఎం 38 కాలువ ద్వారా నీళ్లు వస్తాయనే నమ్మకంతో బావిలో తక్కువ నీరున్నా నాలుగు ఎకరాలలో వరి పంట వేశా. కాని బావిలో నీరు అడుగంటడంతో ఇప్పటికే కొంత పొలం ఎండిపోయింది. రూ.60 వేల వరకు పెట్టుబడి పెట్టాను. అధికారులు వెంటనే కాల్వ ద్వారా నీటిని విడుదల చేసి ఆదుకోవాలి.

- బిల్లా కనికిరెడ్డి, రైతు, రావులపల్లి

రోడ్డుపై దిగబడిన లారీ



వెంకటాపురం(కె): మండల పరిధిలోని సూరవీడు, కొండాపురం గ్రామాల మధ్యలో ప్రధాన రహదారిపై మొక్కజొన్న లోడ్ లారీ ఆదివారం రాత్రి దిగబడింది. దీంతో రాకపోకలు నిలిచిపోయి ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. నిత్యం లారీలు దిగబడుతున్నాయని అధికారులు స్పందించి రోడ్డును మరమ్మతు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ములుగు :
9705748198
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
డి. గణేష్ బాబు (S.R) : 9490002099, 7997958188
పి.చంద్రశేఖర్ (A.C.O) : 9963646944